

కథా కౌముది


# నేను దొంగను కాను

దమ్మవళం శ్రీనివాస్

"పట్టుకోండి.. దొంగ..పారిపోతున్నాడు..." అరుస్తూ జనాలు వెంటబడుతున్నారు. అది పట్టపగలు. నగల షాపునుంచి ఏదో నెక్లెస్ కాజేసి బయటకు పరిగెత్తాడు జగదీష్. షాపువాడు, సెక్యూరిటీ వాళ్ళు, రోడ్డు మీది జనాలు గట్టిగా అరుస్తూ వెంటబడ్డారు.

ఆయాసంతో రొప్పుతున్నాడు జగదీష్. ఎటు పరిగెత్తాలో అర్ధంకావటంలేదు. పరిగెత్తుతూ హడావిడిగా ఆలోచిస్తున్నాడు అసలు తను దొంగతనం ఎందుకు చేసాడా అని. గుర్తుకు రావటంలేదు. తనకు దొంగతనం చేయాల్సిన ఖర్మేంటి అసలు? ఎలా వచ్చింది ఈ దరిద్రపు ఆలోచన? ఏదైతే ఏంటి? తక్షణ కర్తవ్యం ఇక్కడనుంచి తప్పించుకోవటం.

వెంటబడే జనాల సంఖ్య పెరుగుతుందో, తగ్గుతుందో అర్ధం కావాటం లేదు. వెనక్కు తిరిగి చూసే టైం కూడా లేదు. ఇలాంటి సీన్లు ఎన్ని సినిమాల్లో చూసాడు తను. ఎవడో పనికిమాలిన వెధవ రోడ్డు మీద నిలబడి జరిగేదంతా వీడియో తీస్తున్నాడు ఫోన్లో. అసలు తను ఇంత వేగంగా పరిగెత్తగలడని తనకే తెలీదు ఇంతకు ముందు. ఇప్పుడు దొరికిపోతే తన ఉద్యోగం ఉంటుందా? తను పని చేసే కంపెనీలో జాబ్ సెక్యూరిటీ ఎక్కువ అని బాసు గాడు చెబుతూ ఉంటాడు. దొంగగా మారిన తనని ఉద్యోగంలో ఉంచుతారా అసలు? ఏంటీ పిచ్చి ఆలోచనలు? తను దొంగతనం ఎందుకు చేసాడసలు?

ఈలోగా వెనకనుంచి ఒకడు హీరోలా చొక్కా కాలరు పట్టుకొని లాగాడు. కింద పడ్డాడు జగదీష్. చేతులు, కాళ్ళు గీసుకుపోయినయ్. జనమంతా చుట్టూ చేరారు. ఈ హడావిడిలో తను కాజేసిన నెక్లెస్ ఎక్కడో పడిపోయింది. ఎవరో కొట్టడం మొదలు పెట్టారు. ఎక్కడబడితే అక్కడ కొడుతున్నారు. గట్టిగా అరిచాడు దెబ్బలు తింటూ బాధ భరించలేక "నేను దొంగను కాను.."

ఉలిక్కి పడి నిద్ర లేచాడు జగదీష్. జరిగినదంతా కల అని అర్ధమై ఎంతో రిలీఫ్ గా అనిపించింది. ఎంత భయంకరమైన కల? గుండె ఇంకా వేగంగా కొట్టుకుంటుంది. టైం చూసాడు. అర్ధరాత్రి రెండు!! వెంటనే పడుకోవాలంటే భయమేసింది మళ్ళీ కల కంటిన్యూ అవుతుందేమోనని.

లేచి వెళ్లి చల్లటి నీళ్ళు తాగొచ్చి పడుకొని కళ్ళు మూసుకొని ఆలోచిస్తున్నాడు. ఇలాంటి విచిత్రమైన కల ఎందుకు వచ్చింది? ముందుగా జరగబోయేదానికి ఇదేమైనా సంకేతమా? కొంపదీసి తనేమైనా దొంగగా మారబోతున్నాడా భవిష్యత్తులో? ఇంతకు ముందు ఒకటి రెండు సార్లు ఇలా జరిగినట్టు గుర్తు. కలలో ఇంతకుముందు వచ్చిందే నిజంగా జరిగింది. పడుకునే ముందు అదేదో ఇంగ్లీష్ సినిమా చూసాడు. దోపిడీ దొంగల జీవితం గురించిన సినిమా అది. దాని ప్రభావం అనుకుంటా ఈ కల. ఇలాంటి చెత్త సినిమాల జోలికి ఇక మీదట వెళ్ళకపోతే మంచిది. ఆలోచిస్తూ నెమ్మదిగా నిద్రలోకి జారుకున్నాడు.

జగదీష్ వయసు నలభై ఐదు పైనే ఉంటుంది. ఎగువ మధ్యతరగతి ఉద్యోగి. పెద్దగా చెప్పుకునే కష్టాలేమీ లేవు. హోంలోనూ, కార్ లోనూ, రెండు మూడు క్రెడిట్ కార్డులు ఉన్నాయి మామూలుగానే. ఒక్కగానొక్క కొడుకు చరణ్ ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. భార్యతో అప్పుడప్పుడూ చిన్న చిన్న తగాదాలు, యుద్ధాలు తప్ప ఇంకే సమస్యా లేదు.

అలారం గట్టిగా మోగటంతో బద్ధకంగా కళ్ళు తెరిచాడు జగదీష్. బాగా నిద్రపడుతున్న టైంలోనే ఈ వెధవ అలారం మోగుతుంది అనుకుంటూ మంచం మీద నుంచి లేచాడు బద్ధకంగా. సరిగ్గా ఆరైంది. ఒళ్ళు విరుచుకుంటూ మంచం దిగాడు. ఎదురుగా ఉన్న దేవుడి పటానికి భక్తిగా దండం పెట్టుకొని భార్యను లేపడానికి వెనక్కు తిరిగి మంచం వైపు చూసి అదిరిపడ్డాడు. కళ్ళు నులుముకొని సరిగ్గా చూసాడు. తను చూస్తున్నది కలా నిజమా? భార్య లక్ష్మి మంచం మీద సుఖంగా, బద్ధకంగా నిద్రపోతుంది ఎప్పటిలాగే. అదికాదు అతడు చూస్తుంది. పక్కన మరో మనిషి ముసుగు తన్ని పడుకోనున్నాడు తన స్థానంలో.

దగ్గరకు వెళ్లి చూసాడు. అంతా మాయలా ఉందే? ఈ పడుకున్నది ఎవరసలు? ఎక్కడ నుంచి వచ్చాడు? దగ్గరకు వెళ్లి దుప్పటి తొలగించి చూడబోయాడు. చేతులు దుప్పటి మీదుగా వెళ్తున్నాయి కానీ, దుప్పటిని పట్టుకోలేక పోతున్నాయి. కంగారు పడ్డాడు. ఏం జరుగుతుందో తెలియటం లేదు. గాబరాగా ఆలోచిస్తూ అటూ ఇటూ చూస్తున్నంతలో, “కంగారు పడకు... ఆ ముసుగుతన్ని పడుకొని ఉన్నది నువ్వే...” అన్న మాటలు వినిపించాయి వెనక నుంచి.

అదిరిపడి వెనక్కి తిరిగి చూసాడు జగదీష్. ఎవరో వింత మనిషి. ఆరడుగులుంటాడు. నల్లటి శరీరం, పెద్ద మీసాలు, లావుగా, బలంగా ఉన్నాడు. ధగధగలాడే గుడ్డలు, వింత కాళ్ళ జోళ్ళు. మెడలో ఏవో చిత్రమైన, లావైన గొలుసులు. ఒక్క క్షణం గుండె ఆగినంత పనైంది జగదీష్ కు. ఈ వింత మనిషెవరసలు? అసలు మనిషేనా?

“ఎవరు మీరు? ఏం జరుగుతుందసలు? లోపలికి ఎలా వచ్చారు?” అడిగాడు భయంగా.

“నా పేరు సదుష్టుడు. యమదూతను. నువ్వు నిన్న రాత్రి నిద్రలోనే గుండెపోటుతో చచ్చిపోయావు. నిన్ను పైకి తీసుకెళ్ళటానికి వచ్చాను.” చెప్పాడు మొహంలో ఏ భావం ప్రదర్శించకుండా. సదుష్టుడు చూడటానికి చాలా రఫ్ గా ఉన్నా, మాట చాలా మామూలుగా ఉంది.

చచ్చినంత పనైంది జగదేష్ కు యమదూత చెప్పింది విని.

“నేను చచ్చిపోవటమేంటి నాన్సెన్స్. అసలు గుండెపోటు ఎలా వస్తుందో కూడా తెలీదు నాకు. ఎక్కడో ఏదో పొరపాటు జరిగింది. మా పక్కింట్లో ఓ గుండె పేషెంట్ ఉన్నాడు. మీరు అక్కడకు వెళ్ళబోయి ఇక్కడకు వచ్చినట్టున్నారు” చెప్పాడు ఒక్కో మాట కూడబలుక్కొని అతి కష్టం మీద .

ఒళ్ళంతా తేలిగ్గా, అదోరకంగా ఉంది. తను కొంపదీసి నిజంగానే చచ్చిపోయాడా? తను లేకుండా తన కుటుంబం ఎలా గడుస్తుంది? భార్యకు టీవీ సీరియల్స్ తప్ప వేరే లోకం తెలీదు. చరణ్ మరీ చిన్నపిల్లవాడు. ఇదంతా అసలు నిజమేనా? ఏడుపు తన్నుకొచ్చింది. బలవంతంగా కంట్రోల్ చేసుకుంటున్నాడు.

“ఏడవకు. ఇదంతా మామూలే. నువ్వు చచ్చిపోవటం నిజం. టైం అవగానే ఎవరైనా చావాల్సిందే. గుండెపోటు అనేది డాక్టర్లు చెప్పబోయే కారణం. అసలు కారణం మాత్రం నీ టైం అయిపోవటం. ఇంకాసేపట్లో ఇంట్లో వాళ్ళకి నువ్వు చచ్చిన విషయం తెలుస్తుంది. ఏడుపులు, పెడబొబ్బలు మొదలవుతాయి. అవన్నీ నువ్వు చూడలేవు. పద. కదులు. నాకు ఇంకో నాలుగు చావులున్నాయి ఇవాళ. నిన్ను దింపి మళ్ళీ రావాలి.” శాంతంగా చెప్పాడు సదుష్టుడు ఇలాంటివి ఎన్నో చూసిన అనుభవంతో.

“నేను చచ్చినా రాను..” మొండిగా, కోపంగా చెప్పాడు జగదీష్ మంచం మీద కూర్చొని. తను చచ్చిపోయిన విషయం దాదాపుగా అర్థమైంది. ఏడవటం మొదలు పెట్టాడు చేతుల్లో మొహం దాచుకుంటూ. ఇంత అకస్మాత్తుగా తను చస్తానని కల్లో కూడా అనుకోలేదు. ఏంటీ జీవితం? కాదు ఏంటీ చావు? ఎక్కడనుంచి వచ్చాడు? ఎందుకు వచ్చాడు? ఎందుకు ఇలా చచ్చిపోవాల్సి వచ్చింది? ఆలోచిస్తున్నాడు. ఎన్నో జవాబు లేని ప్రశ్నలు.

“నీ ప్రశ్నలన్నిటికీ జవాబు దారిలో చెబుతానులే పద. మొండికేయవాకు. ఏడ్చి ప్రయోజనంలేదు..” అంటూ జగదీష్ చేయి పట్టుకొని మంచం మీదనుంచి లేపి నుంచోబెట్టాడు సదుష్టుడు. ప్రతిఘటించాలనుకున్నాడు జగదీష్. కుదరటంలేదు. అసలు అవయువాలు స్వాధీనంలో లేవు. గట్టిగా అరిచి భార్యను లేపబోయాడు. నోట్లోంచి మాట బయటకు రాలేదు. సదుష్టుడు జగదీష్ ఎడమ చేయి పట్టుకొని తేలికగా ఇంటి పైకప్పు మీదుగా గాల్లో బయటకు తీసుకువెళ్ళాడు. గోడలు, పైకప్పు ఏవీ వీరి శరీరాలకి అడ్డుపడలేదు. ఇద్దరివీ ఏవో అదృశ్య శరీరాల్లాగా అన్నింటినీ దాటుకొని పైకి వెళుతున్నాయి.

కిందికి చూసాడు జగదీష్. ఇంటి పై భాగం కనిపిస్తుంది. ఎప్పుడూ తన ఇంటిని ఇలా చూస్తాడనుకోలేదు. కొత్తగా, దుఃఖంగా ఉంది అంతా. తను ఎంతో కష్టపడి, బ్యాంకు లోన్ తీసుకొని కట్టుకున్న ఇల్లది. ఇప్పుడు ఇలా చచ్చిపోయి వెళ్ళిపోతున్నాడు ఒంటరిగా. తన కుటుంబానికి తను ఇక లేడు అనుకున్నాడు పొంగి వచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ.

తను ఇప్పుడు వెళ్ళేది యముడి దగ్గరకా? అసలు యమలోకమనేది ఒకటుందని తనకు సినిమాల ద్వారానే తెలిసింది. ఇప్పుడు స్వయంగా చూడబోతున్నాడు. తనని ఎలా శిక్షిస్తారు? నూనె బాండీలో వేయించడం, సూదులతో కుళ్ళబోడవటం లాంటివి ఉండవు కదా కొంపదీసి? అయినా శిక్షించడానికి తను చేసిన నేరమేంటి? ఎవరినీ ఎప్పుడూ మోసం చేయలేదు. నిజాయితీగా కష్టపడి చదువుకొని పైకి వచ్చాడు. ఇలా ఆలోచిస్తూ తను చేసిన తప్పుడు పనులు ఏమున్నాయా అని ఆలోచించాడు. పెద్దగా ఏమీ తట్టలేదు. కాస్త తృప్తిగా అనిపించింది. అలాగే చేసిన మంచి పనులు కూడా పెద్దగా తట్టలేదు. అసలు ఈ యమదూతను అడిగితే విషయాలన్నీ తెలుస్తాయి.

తను చనిపోయిన విషయం అర్ధమవగానే, తాత్కాలికంగా, దుఃఖాన్ని పక్కనబెట్టి ఇకమీదట జరగబోయే దాని గురించి ఆలోచిస్తున్నాడు జగదీష్. గాల్లో ఇద్దరూ ప్రయాణం చేస్తున్నారు. ఎంత వేగంగా వెళ్తుంది తెలియటంలేదు.

"సర్ మీ పేరేమిటన్నారు?"

"సదుష్టుడు..".

"నాక్కొన్ని డౌట్స్ ఉన్నాయి? తీరుస్తారా?" అడిగాక, అసలు ఈ యమదూతకి ఇంగ్లీషు వచ్చా అని అనుమానం వచ్చింది జగదీష్ కు. "డౌట్స్" అన్న పదం తెలుగులో చెబుదామనుకున్నాడు.

"నాకు అన్ని భాషలు వచ్చు...అలాగే నువ్వు మనసులో అనుకునేదంతా నాకు తెలుసు.." చెప్పాడు సదుష్టుడు.

"వామ్మో ఇంకా నయం వీడ్ని మనసులో బండబూతులు తిట్టుకోలేదు.." మనసులో అనుకొని నాలిక్కరచుకున్నాడు జగదీష్ యమదూతకు ఇది కూడా తెలుస్తుంది అనిపించడంతో.

"ఇక నీ ప్రశ్నలకి జవాబు చెబుతాను విను. సాధారణంగా అందరికీ వచ్చే అనుమానాలే ఇవి. నీ టైం అయిపోవటం వల్ల నువ్వు చచ్చిపోయవు. ప్రతీ జీవి చనిపోయే తేదీ, టైము ముందుగానే డిసైడ్ అయి ఉంటుంది. నువ్వు చేసిన మంచి, చెడు అన్నీ మా దగ్గర రికార్డ్స్ లో ఉంటాయి. చెడ్డ పనులకి నీకు శిక్ష తప్పదు. నువ్వో దొంగవని యమలోకంలో ఎవరో మాట్లాడుకుంటే విన్నాను. ఇంకో ఐదు నిమిషాల్లో మనం యమలోకం చేరుకుంటాము.."

"నేను దొంగనా? ఏంటీ దారుణం? ఖచ్చితంగా అందరూ పొరబడ్డారు. ఇంకవరినో తీసుకురాబోయి నన్ను పట్టుకెళ్తున్నారు. అన్యాయం ఇది." కల్లో కూడా దొంగతనం చేయలేదు అని ఆవేశంగా అనబోయి ఊరుకున్నాడు రాత్రి వచ్చిన కల గుర్తుకువచ్చి.

"పైకి వెళ్తాంగా. అక్కడ అన్నీ తెలుస్తాయి" చెప్పాడు సదుష్టుడు క్లుప్తంగా.

"సర్. మనం ఏ స్పీడులో వెళ్తున్నాం ఇప్పుడు? ఏమీ అర్ధం కావట్లేదు.. కాస్త నెమ్మదిగా వెళ్తునట్టుగా అనిపిస్తుంది? " అడిగాడు. తొందరగా వెళ్ళి తను దొంగను కానని తేల్చేయాలని ఆత్రంగా ఉంది జగదీష్ కు.

"దాదాపు లక్ష కిలోమీటర్లు గంటకి.."

గుండె ఆగినంత పనైంది జగదీష్ కి ఇది విని. ఇదేమి స్పీడు బాబోయ్. గుండె ఆల్రెడీ ఆగిపోయింది కాబట్టి సరిపోయింది. లేకపోతే ఇంకేమైనా ఉందా?

యమలోకం చేరుకున్నారు ఇద్దరూ. ముఖద్వారం వైపు నడవటం మొదలు పెట్టారు. దారిలో ఏవో ఊహించుకున్నాడు యమలోకం ఎలా ఉంటుందా అని. అయితే తను ఊహించుకున్నట్టుగా ఏమాత్రం లేదు. కనీసం యమలోకం అన్న బోర్డు కూడా లేదు. ఏ మాత్రం భయానకంగా లేదు. అంతా ప్రశాంతంగా ఉంది చుట్టుపక్కల. ఆలోచిస్తూ నడుస్తున్నంతలో ముఖ ద్వారం చేరుకున్నారు. ద్వారం దగ్గర ఓ నలుగురు నుంచొని ఉన్నారు. చూడటానికి సదుష్టుడు లానే ఉన్నారు చేతుల్లో పొడవైన బల్లాలతో. కాపలా వాళ్లనుకుంటా. సదుష్టుడు వారికి ఏదో సైగ చేసాడు జగదీష్ ను చూపిస్తూ. వారు ఓ మారు జగదీష్ ను తేరిపారా చూసి లోపలకి పంపించారు. వారేమైనా తన వైపు జాలిగా చూస్తున్నారా అని ఓర కంట గమనించాడు జగదీష్.

అలాంటిదేమీ కనిపించలేదు. అసలు ఈ యమలోకంలో ఎవరికీ ఎక్స్ప్రెషన్స్ ఉండవనుకుంటా. కాస్త నిరుత్సాహంగా అనుకున్నాడు. ఏం జరగబోతుంది లోపల? కాస్త కుతూహలంగా, భయంగా అనుకుంటూ యమలోకంలోకి అడుగుపెట్టాడు.

తనలాంటి వారు ఎవరైనా కనబడతారేమోనని చూసాడు. ఎవరూ లేరు. చుట్టూ చూసాడు. అదో పెద్ద గదిలా ఉంది బంగారు రంగు గోడలతో. ఏవో సంస్కృత శ్లోకాలాంటివి రాసున్నాయి గోడల నిండా. ఎదురుగా ఓ సింహాసనం, దానికి ఓ పక్క ఓ బోను కూడా ఉంది కోర్టులో ఉన్నట్టుగా. తనని ఇప్పుడు అందులో నుంచోబెట్టి విచారణ చేస్తారా? సదుష్టుడు జగదీష్ ను లోపలికి పంపి తన పని అయిపోయినట్టుగా అక్కడనుంచి వెళ్ళిపోయాడు. ఇంకో నలుగురుకి ఇవాళ మూడబోతుందని చెప్పాడుగా. అక్కడికే వెళ్ళుంటాడు. ఎవరో వారు పాపం. జగదీష్ జాలిగా అనుకున్నాడు మనసులో.

ఈలోగా ఎవరో ఇద్దరు యమకింకరులు ఎక్కడనుంచో వచ్చి చెరో వైపు జగదీష్ చేతులు పట్టుకొని విచారణకు బోను దగ్గరకి తీసుకువెళ్ళారు. బోనులో నుంచున్నాడు జగదీష్. ఇద్దరు యమకింకరులు బోనుకు చెరో వైపు నుంచొని ఎవరికోసమో ఎదురు చూస్తున్నారు.

మొదట చిత్రగుప్తుడు వచ్చాడు చేతిలో ఏదో లావాటి పుస్తకంతో. సినిమాల్లో చూసి, చిత్రగుప్తుడంటే ఏదో కమెడియన్లా ఉంటాడనుకున్నాడు జగదీష్. అయితే అందుకు విరుద్ధంగా ఉన్నాడు. దాదాపుగా సదుష్టుడిలానే ఉన్నాడు. మెడలో గొలుసులు కాస్త తేడాగా, హుందాగా ఉన్నాయి. అలాగే తలమీద ఓ చిన్న కిరీటం కూడా ఉంది. చిత్రగుప్తుడు ఏమీ మాట్లాడకుండా ఓ పక్కగా నుంచున్నాడు యముడి కోసం ఎదురుచూస్తూ. జగదీష్ జరిగేది కాస్త ఉత్సాహంగా, భయంగా చూస్తున్నాడు.

యముడు వచ్చాడు మరికాసేపటికి. నేరుగా సింహాసనం మీదే కూర్చొని ప్రత్యక్షమైనాడు. చిత్రగుప్తుడు, యమకింకరులు తలలు వంచి యముడికి అభివాదం చేసారు. జగదీష్ కూడా చేతులు జోడించి నమస్కరించాడు. ఓ సారి యముడ్ని తేరిపార చూసాడు. చిత్రగుప్తుడు, యమకింకర్లకంటే బాగా పొడుగ్గా, నల్లగా, బలంగా, భయంకరంగా ఉన్నాడు. తల మీద భారీ బంగారు కిరీటం. ఇక్కడ కాబట్టి సరిపోయింది కానీ, భూలోకం మీద ఇలాంటి వాళ్ళు ఉంటే, జనాలు భయంతో చచ్చేవారు. మనసులో అనుకున్నాడు.

విచారణ ప్రారంభమైంది.

“ప్రభూ, ఈ పాపి ఒక దొంగ. ఎన్నో దొంగతనాలు చేసాడు...లక్షల రూపాయలు కొల్లగొట్టాడు..” అంటూ ఇంకా ఏదో చెప్పబోతున్న చిత్రగుప్తుడ్ని మధ్యలోనే ఆపాడు జగదీష్ అసహనంగా, ఒకింత కోపంగా.

“ప్రభూ, ఏదో పొరపాటు జరిగింది. నేను దొంగను కావటం ఏంటో అర్థంకావట్లేదు. ఎవరో దొంగను తీసుకురాబోయి, మీ భటులు పొరపాటున నన్ను ఇక్కడకు తీసుకువచ్చారు. ఆఫీసులో చాలా పనులున్నాయి. దయచేసి నన్ను వెంటనే వెనక్కు పంపండి ..” చెప్పాడు.

“పొరపాట్లు జరగడానికి ఇదేమీ భూలోకం కాదు. పైగా ఇదేమీ కోర్టు కాదు, నీ నేరాలు నిరూపించడానికి. మా రికార్డ్స్ ప్రకారం, నువ్వు చేసిన పాపాలు ప్రభువుకు విన్నవించడమే నేను చేసేది. మధ్యలో మాట్లాడటానికి నీకు అవకాశం ఉండదు..” చిత్రగుప్తుడు చెప్పాడు కోపంగా.

యముడు కాసేపు మౌనంగా, గంభీరంగా ఉండి, చిత్రగుప్తుడి వైపు చూసి జగదీష్ కు అర్థమయ్యేలా వివరంగా చెప్పమన్నట్టుగా తలాడించి సైగ చేసాడు. జగదీష్ కు ఏమీ అర్థం కావటంలేదు. వీళ్ళు ఖచ్చితంగా పొరపడ్డారు. లేకపోతే తను దొంగతనం చేసి లక్షలు కొల్లగొట్టడమేంటి?

“చూడు పాపి...” అంటూ ఏదో చెప్పబోయాడు చిత్రగుప్తుడు.

“నేనే పాపం చేయలేదు.. ఇలా నన్ను పాపి అని పిలవటం దారుణం. నేను చేసిన దొంగతనమేంటో ముందు తేల్చండి...” అసహనంగా అరిచాడు.

“అలాగే. ప్రభువులవారు నీకు అర్థమయ్యేలా చెప్పమన్నారు కాబట్టి చెబుతాను. సాధారణంగా ఇలా వివరించి చెప్పటం, నేరం నిరూపించటం లాంటివి ఇక్కడ ఉండవు. ఇక్కడికి పాపులు మాత్రమే వస్తారు... నువ్వు కూడా అంతే.. ఇప్పుడు నువ్వు ఎందుకు దొంగవో చెబుతాను..”

చిత్రగుప్తుడు ఏం చెబుతాడో అని కుతూహలంగా, కాస్త అలజడిగా చూస్తున్నాడు జగదీష్.

“నువ్వు దొంగవెలా అయ్యావో చెప్పే ముందు అసలు నీకు మా రూల్స్ ప్రకారం దొంగతనమంటే ఏంటో తెలియాలి. ఇతరులకు సంబంధించిన ధనమో, ఆస్తో, వస్తువో అక్రమంగా సంపాదించడాన్ని దొంగతనమంటారు...”

“అవును... మా దగ్గర కూడా దొంగతనం డెఫినిషన్ అదే... ఈ రూలు ప్రకారం నేను దొంగనయ్యే ఛాన్స్ లేదసలు..” చెప్పాడు జగదీష్.

"ఇప్పుడు చాలా తేలికగా నువ్వు ఎందుకు దొంగవో చెబుతాను.. నువ్వు నిన్న ఆఫీసుకి వెళ్తూ కార్లో విన్నది ఏ సినిమా పాటలు?"

"......" సినిమా పేరు చెప్పాడు జగదీష్ ఎందుకు ఈ ప్రశ్న అడిగాడో అని తికమక పడుతూ.

"ఆ పాటలు నువ్వు అక్రమంగా నెట్ లోంచి డౌన్లోడ్ చేసుకున్నవి... అవి ప్లే చేయడానికి నువ్వు వాడింది నీ ఆఫీసు పెన్ డ్రైవ్... ఇప్పుడు చెప్పు నువ్వు దొంగవా కాదా?"

"ఇది అన్యాయం.. ఇలాంటి చిన్న విషయాలు కూడా దొంగతనాలేనా?"

"ఇవేవీ చిన్నవి కాదు. పైగా దొంగ మా లెక్కలో దొంగే. చిన్నదొంగ పెద్దదొంగ అంటూ ఉండరు. ఇవి మాత్రమే కాదు. నువ్వు ఇంకా ఎన్నో రకాల దొంగతనాలు చేసావు. ఆఫీసులో నీ జూనియర్ చేసిన పనిని నువ్వు చేసినట్టుగా బాసు దగ్గర చెప్పుకోవటం, టాక్స్ తగ్గించుకోవటానికి దొంగ అద్దె రసీదులు, దొంగ డొనేషన్లు సృష్టించటం, ఆఫీసు ఫోన్లో పర్సనల్ కాల్స్ చేయటం, మందు బిల్స్ ఫుడ్ బిల్స్ గా మార్చి క్లెయిమ్ చేసుకోవటం, ఆఫీస్ అసిస్టంట్లను ఇంటి పనులకు వాడుకోవటం, దుక్కలా ఆరోగ్యంగా ఉండి సిక్ లీవ్ పెట్టడం, కస్టమర్స్ కోసం కొన్న గిఫ్ట్ ఐటమ్స్ మిగుల్చుకొని ఇంటికి పట్టుకెళ్ళడం, ఆఫీసు కారు ఇంటి పనులకు వాడటం, చిల్లర సరిగ్గా చూసుకోక షాపువాడు ఎక్కువ డబ్బులిస్తే సంతోషంగా జేబులో వేసుకోవటం, కరెంటు బిల్లు తగ్గించడానికి మీటర్ టాంపరింగ్ చేయటం, ఫ్యామిలీతో బయటకు వెళ్లి, ఆ ఖర్చంతా కంపెనీ ఖర్చుగా చూపటం, రకరకాల పైరేటెడ్ సాఫ్ట్ వేర్లు, సినిమాలు డౌన్లోడ్ చేసుకోవటం, ఆఫీసు స్టేషనరీ ఇంటికి పట్టుకెళ్ళడం. అంతెందుకు దిక్కుమాలిన వీడియోలు ఆఫీసు టైములో అందరికీ వాట్సప్ లో పంపి వారందరి ఆఫీస్ టైం వేస్టు చేయటం కూడా మా లెక్కలో దొంగతనమే.. "

మూర్ఛపోయినంత పనైంది జగదీష్ కు.

"నువ్వు బతికుండగా నీ జీతం ఎంత?" అడిగాడు చిత్రగుప్తుడు

"రెండు లక్షలు..."

చిత్రగుప్తుడు ఒక్కసారి గొంతు సవరించుకొని మళ్ళీ చెప్పటం మొదలుపెట్టాడు.

"నీ ఆఫీసు వారానికి ఐదు రోజులు కాబట్టి, నీ జీతం గంటకు పద్నాలుగు వందలు. నువ్వు రోజూ ఆఫీసుకు గంట ఆలస్యంగా వెళ్లి, గంటకు పైగా పనికిమాలిన కబుర్లు, పర్సనల్ ఫోన్ కాల్స్, ఈమెయిల్స్, పర్సనల్ పనులు, ఇంటర్నెట్లో టైంపాస్ లాంటివాటికి వెచ్చించావు కాబట్టి, రోజుకు దాదాపుగా మూడు వేల రూపాయలు ఆఫీసునుండి అక్రమంగా సంపాదించావు నీ జీతం రూపంలో. అంటే సంవత్సరానికి ఏడు లక్షల ఇరవై వేలు... ఇది నేరుగా నువ్వు కొల్లగొట్టిన డబ్బు.. ఇది కాక, ఈ రెండుగంటల వృధా సమయంలో ఆఫీసువారికి ఖర్చయ్యే కరెంటు, నీళ్ళు, నీ వల్ల ఆలస్యమైన పనుల వల్ల నీ కంపెనీకి పెరిగే ఖర్చు, నిన్ను చూసి నీలాగే తయారయే నీ కింది ఉద్యోగులకి ఆఫీసువారు ఈ విధంగా పెట్టే ఖర్చు.. ఇవన్నీ నీ అక్రమ ఖాతాలో జమ అయిన డబ్బు.."

జవాబేంచెప్పాలో అర్ధం కాలేదు జగదీష్ కు. ఆలోచనలో మునిగిపోయాడు. ఇప్పుడు పూర్తిగా అర్ధమైంది. చిత్రగుప్తుడు చెప్పిన ప్రతీ విషయం నిజమే. అన్నీ దొంగతనాలే. తనొక గజదొంగే అనిపిస్తుంది. సందేహం లేదు. కానీ ఒప్పుకోవాలంటే నరకంలా ఉంది. తనున్నది కూడా నరకంలోనే అని గుర్తుకువచ్చింది.

"ఇప్పుడు అర్ధమైందా నువ్వు ఎందుకు పాపివో?" ఎగతాళిగా అడిగాడు చిత్రగుప్తుడు. మౌనంగా తలదించుకున్నాడు జగదీష్ ఏం చెప్పాలో తెలీక.

యముడు కింకర్లకి ఏదో సైగ చేసాడు. ఎదురుగా ఏదో ద్వారం తెరుచుకుంది. పాపులను చిత్రహింసలు పెట్టే గదికి అది దారి. హింసకు గురవుతున్న వేలమంది పాపుల గావుకేకలు వినిపిస్తున్నాయి గట్టిగా. జగదీష్ ను అక్కడకు ఈడ్చుకు వెళ్ళటానికి యమకింకర్లు దగ్గరకు వచ్చారు.

"నో.... నేను దొంగను కాను.." గట్టిగా అరిచాడు జగదీష్ పట్టరాని భయంతో..

"ఏంటండీ? ఏమైంది?" భార్య లక్ష్మి అడిగింది.

"నువ్వు కూడా నరకానికి వచ్చావా లక్ష్మీ?" ఆశ్చర్యంగా అడిగాడు జగదీష్. అడిగాక చప్పున లేచి కూర్చున్నాడు. కళ్ళు తెరిచి చుట్టూ చూసాడు. తన ఇల్లే. మంచం మీదే ఉన్నాడు. జరిగినదంతా కల అని అర్ధమైంది. రెండవ కల. చెప్పలేని రిలీఫ్ గా అనిపించింది.

గట్టిగా ఊపిరి పీల్చుకున్నాడు. ఎంత భయంకరమైన కల. అలారం మోగింది గట్టిగా.

"ఏదైనా పీడకలా?" భార్య అడిగింది కుతూహలంగా.

జవాబు చెప్పకుండా మంచం దిగి దేవుడి పటం దగ్గరకు వెళ్ళి మనస్పూర్తిగా దండం పెట్టుకున్నాడు. ఎన్నో ఆలోచనలు చుట్టుముట్టినయ్. కాఫీ తాగుతూ, పేపర్ చదువుతూ, ఆఫీసుకు రెడీ అవుతూ ఆలోచిస్తున్నాడు తనకు వచ్చిన కల గురించి.

కల్లో చిత్రగుప్తుడు చెప్పింది ఎంత నిజం. ప్రతీ వాళ్ళు తెలిసో తెలీకో ఎన్ని తప్పులు చేస్తున్నారు. ఆఫీసు సమయం వృధా చేయటం దగ్గరనుంచి ఎన్నో రకాల దొంగతనాలు ఎంతో మంది అలవాటుగా, దర్జాగా చేస్తున్నారు. మొదటి కలలో తను చేసిన దొంగతనానికీ, రెండవ కలలో వివరించినట్టుగా తను చేసిన దొంగతనానికీ ఏ తేడా లేదు!! ఇంత చిన్న విషయం ఇన్నాళ్ళుగా తనకి తెలీదు. ఇక మీదట ఏ దొంగతనం తను చేయటానికి వీల్లేదు. గట్టిగా నిర్ణయించుకున్నాడు జగదీష్.

టిఫిన్ చేసి ఆఫీసుకు బయలుదేరాడు. వెనకనుంచి చరణ్ గట్టిగా అరిచాడు. "నాన్నా, నా ప్రాజెక్ట్ పేపర్స్ నీకు ఈమెయిల్ చేసాను. వంద పేజీలు ఉంటాయి కనీసం. వచ్చేటప్పుడు ఆఫీసులో ప్రింటౌట్స్ తీసుకొనిరా. మర్చిపోకు"

"అలాగేలే" అనబోయి ఆగాడు జగదీష్.

ఇంట్లోకి తిరిగి వెళ్ళి, "ఆఫీస్ ప్రింటరు, పేపర్స్ మొదలైనవి పర్సనల్ పనులకు వాడటం తప్పు. అది ఆఫీసు డబ్బును దొంగలించడంతో సమానం. ఈ ఐదు వందలు తీసుకొని, నువ్వే నీ ప్రాజెక్ట్ పేపర్సు ప్రింట్ చేయించుకో" చెప్పాడు ఆశ్చర్యంగా చూస్తున్న చరణ్ చేతిలో డబ్బు పెడుతూ.

చెప్పాక మనసులో తృప్తిగా, సంతోషంగా అనుకున్నాడు జగదీష్ "నేను దొంగను కాను".

★★★

**Click here to share your comments on this story**